బడిలో పాముల భయం

- గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నతపాఠశాల తరగతి గదుల్లో దెబ్బతిన్న ఫ్లోరింగ్
- నిరుపయోగంగా మారిన మరుగు దొడ్ల చుట్టూ చెట్లపొదలు
- పాముల సంచారంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన
- పోలింగ్ కేంద్రాల వద్ద తాత్కాలిక మరమ్మతులు

జిల్లా కేంద్రంలోని సర్కారు బడి తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పూర్తిగా శిథిలమైంది. పెద్ద పెద్ద రంధ్రాలు పడి పాముల సంచరిస్తున్నాయి. విడిచిన కుబుసంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఓ టీచర్ పాఠశాలలోని స్టాఫ్‌రూంకు వెళ్లి అక్కడ కూర్చుందో లేదో..? మరో కుర్చీలో ఓ పాము పడగవిప్పి బుసలుకొడుతూ కనిపించింది. ఒక్కసారిగా ఉలిక్కిపడి కేకలు వేయడంతో మిగిలిన టీచర్లు అక్కడికి చేరుకునేలోపు పాము వెళ్లిపోయిన భయాందోళన సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల హైస్కూల్‌లో చోటు చేసుకుంది.

- మంచిర్యాలఅర్బన్



గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఫ్లోరింగ్ పగులుతేలి..

స్థానిక గోసేవా మండలిలో ఉన్న పాఠశాలను 1985లో కాలేజీరోడ్‌లో ఐదు ఎకరాల స్థలంలో నిర్మించిన భవనంలోకి గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మార్చారు. ప్రస్తుతం గర్మిళ్ల హైస్కూల్‌లో 221 మంది పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఏ గదిలో చూసినా పగుళ్లు కనిపిస్తుంటాయి. గదుల్లో పాఠాలు బోధించటం కన్నా.. ఉపాధ్యాయులకు పాముల భయం వెంటాడుతోంది. పాఠశాలలో మూడు చోట్ల మరుగుదొడ్లు నిర్మించిన నీటి సరఫరా, నిర్వహణ లేక మూలన పడ్డాయి. పాఠశాల ప్రహరీ కూలిపోయింది. దీంతో ఒక్కరోజు సెలవువస్తే చాలు బెంచీలపై గుర్తు తెలియని వ్యక్తులు మలవిసర్జన చేసి వెళ్తుతుండటంతో ఇబ్బంది మారుతోంది. శుభ్రం చేయాలంటే ఉపాధ్యాయులకు తలకుమించిన భారంగా మారుతుంది. పాఠశాల ఆవరణలో కూల్చివేతకు నిర్ణయించిన(డిస్మెటల్) గదుల్లోనే విద్యార్థులు విద్యాబోధన సాగుతుండటం గమనార్హం. ఇటీవల బదిలీపై వచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి(డీసీఈబీ) బాధ్యతలు ఉండటంతో పాఠశాలపై దృష్టిసారించని పరిస్థితి. ఇతర జిల్లాలో మాదిరిగా పనిచేసే చోట డీసీఈబీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



తరగతి గదిలో ధ్వంసమైన ఫ్లోరింగ్



హడావుడిగా మరమ్మతు..

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడ వరండాలో ఫ్లోరింగ్ చూసి అధికారులు మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలున్నా, గదుల ముందర వరండాలో పనులు చేపట్టడం, మిగిలిన వరండాతో పాటు గది లోపల పనులు చేపట్టకుండా వదిలేస్తున్నారు. దీంతో ఓటరు ఎట్లా నడుచుకుంటూ వెళ్తాడో..? ఎగుడు దిగుడు ఉన్న చోట కూర్చుని ఉద్యోగులు ఏ విధంగా విధులు నిర్వర్తిస్తారో అధికారులకే తెలియాలి. విధులు నిర్వహించే ఉద్యోగులు, ఓటర్ల కోసం మరుగుదొడ్లపై విస్మరించారు. అధికారులు తాత్కాలిక మరమ్మతు కాకుండా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు

నడవలేక పోతున్నాం



పాఠశాల తరగతి గదుల్లో ఫ్లోరింగ్ దెబ్బతిని నడవాలంటే ఇబ్బంది అవుతోంది. కాలు బెణకటంతో కింద పడుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇంకోవైపు ఎప్పుడు ఎటు నుంచి పాములు వస్తాయోనని ఆందోళన ఉంది. పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి.

- స్నేహ, విద్యార్థి

ప్రభుత్వం విద్యార్థుల అవసరాలు తీర్చాలి



విద్యార్థుల కనీస అవసరాలు తీర్చాలి. అప్పట్లో పాఠశాలలో అన్ని సౌకర్యాలుండేవి. ఈ స్కూల్లో చదివిన ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, రాజకీయ నాయకులుగా ఎదిగారు. ప్రభుత్వం పాఠశాలపై దృష్టి పెట్టకపోవటంతో స్కూల్ శిథిలావస్థకు చేరింది. పాఠశాలను చూస్తే చాలా బాధగా ఉంది. పిల్లల చదువుకు అన్ని వసతులు ఉండేలా కృషి చేయాలి.

- నరేంద్ల శ్రీనివాస్, పూర్వ విద్యార్థి

క్లుప్తంగా

రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సబితా

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన గరిసందుల సబితా రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. సబిత ప్రస్తుతం ఇచ్చోడ గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ చేయాలనే తపనతో ఉస్మానియా యూనివర్సిటీలో రసాయన శాస్త్రంలో 'ఇనార్గానిక్' అనే అంశంపై పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. పట్టుదల ఉంటే మహిళలు కూడా అనుకున్నది సాధించగలుగుతారని సబితా నిరూపించారు.

'మ్యాన్‌హోల్' మూసేశారు



సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు ఎంట్రన్స్ ఆర్చి ఎదుట మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉందని, దానిని మూసేయాలని 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' శీర్షికన ఈ నెల 6వ తేదీన వచ్చిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం మ్యాన్‌హోల్‌ను మూసేసి, సిమెంట్‌తో చదును చేశారు.

కామర్స్ అతిథి అధ్యాపక పోస్టుకు ఆహ్వానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుని పోస్టు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ పోస్టుకు పీహెచ్‌డీ, నెట్, సెట్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పాసయ్యి ఉండాలన్నారు. బయోడేటా, బోనోఫైడ్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, కాన్వొకేషన్, కులం జిరాక్స్ కాపీలను జతపరిచి కళాశాలకు 9వ తేదీ ఉదయం పది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. అదే రోజున త్రిసభ్య కమిటీ ద్వారా జరిగే ఇంటర్వ్యూ, డెమో ద్వారా అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జీవిత బీమా.. భవిష్యత్‌కు ధీమా



అవగాహన కల్పిస్తున్న వెంకటస్వామి

నెన్నెల: బీమా చేయడం అంటే భవిష్యత్ కోసం పొదుపు చేయడమని ఐపీపీబీ మంచిర్యాల బ్రాంచి సీనియర్ మేనేజర్ వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం తపాలా శాఖ బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విక్రమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నెన్నెల పోస్టుమాస్టర్ రాజబాబు, కార్యదర్శి సాగర్, వివిధ మండలాల బ్రాంచి పోస్టుమాస్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

కుంగిన కాలువ



మంచిర్యాల రూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గంగావాడలో ఇటీవల నూతనంగా నిర్మించిన మురికి కాలువ కుంగిపోయింది. ఎమ్మెల్యే నిధుల కింద మంజూరైన రూ.7లక్షల నిధులతో కాలువ నిర్మాణం పూర్తి కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, నాణ్యతా లోపం కారణంగా ఆ కాలువ కుంగిపోగా నిర్మాణ పనులు వృథా కాగా నిధులు మురికినీటి పాలయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అట్టహాసంగా కళోత్సవ పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు

తాండూర్: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మండల స్థాయి కళోత్సవ పోటీలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యం, శాస్త్రీయ, జానపద సంగీతం, డ్రామా, చిత్రలేఖనం అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 09, 10వ తేదీల్లో మంచిర్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుమన, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుమురం భీం వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట: మండలంలోని సాలేగూడలో కుమురం భీం వర్ధంతిని ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీలు, పటేళ్లు, నాయకులు, మహిళలు, యువత పాల్గొని భీం విగ్రహం వద్ద నివాళులర్పించారు. భీం ఆశయాలను కొనసాగించాలని, రాబోయే రోజుల్లో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సిడాం గణపతి, రాయిసెంటర్ అధ్యక్షుడు మెస్రం మహదు, ఉపమేడి కుంరం జనార్దన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణరెడ్డి, రాష్ట్ర తుడుందెబ్బ నాయకులు ఆడ జంగు, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్ తదితరులున్నారు.

అవినీతి పాలన అంతమొందించాలి

- చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి



బైక్ ర్యాలీలో వివేక్, మాజీ ఎమ్మెల్యే ఓదెలు

జైపూర్/మందమర్రిరూరల్/భీమారం: అవినీతి కేసీఆర్ పాలనను అంతమొందించాలని కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎంపీ గడ్డం వివేక్‌వెంకటస్వామి తెలిపారు. జైపూర్ మండలం ఇందారం మై ఫంక్షన్ హాల్లో సోమవారం ముందుగా సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఇందారం నుంచి జైపూర్ మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. హామీలు మరిచి ఆస్తులు పెంచుకున్న బీఆర్ఎస్‌ను, ఈ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలునిచ్చారు. ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజలు కేసీఆర్‌కు అధికారం ఇస్తే, దానిని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వవిప్ బాల్కసుమన్ రూ.1000కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజలు ఆనందంగా జీవిస్తారని తెలిపారు. నాడు తన తండ్రి గడ్డం వెంకటస్వామి ఆలోచన మూలంగానే నేడు సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం జరిగిందని, కానీ ఉద్యోగాల కల్పనలో స్థానికులకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 6 గ్యారంటీ స్కీంలను వివరించారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ విద్యామండలి చైర్మన్ తుమ్మలపల్లి పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నలాల్ల ఓదెలు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఫయాజ్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పొడేటి రవి, మాజీ జెడ్పీ చైర్మన్ మూల రాజిరెడ్డి, చేకూర్తి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'తెలంగాణతో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది'

చెన్నూర్: తెలంగాణ ఏర్పడితే పేదల బతుకులు బాగుపడలేదని, కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని మారుతీ హనుమాన్ మందిర్ ఎదుట నిర్వహించిన రోడ్డు షోలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల కోట్లు కొల్లగొట్టిన కేసీఆర్‌కు ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, తెలంగాణ విద్యావంతుల వేదిక చైర్మన్ విఠల్, హైకోర్టు న్యాయవాది శరత్‌కుమార్ మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు, ఆర్యవైశ్య సంఘం ముఖ్య సలహాదారుడు మల్లిక్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, ప్రొఫెసర్ పాపిరెడ్డి, మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్, గొడిసెల బాపురెడ్డి, మైదం రవిలు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక'



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి వినోద్

నెన్నెల: బీఆర్ఎస్ పార్టీకి చెందిన నెన్నెల మండల సహకార సంఘం డైరెక్టర్ పున్నపురెడ్డి పోశిరెడ్డి, బీజేపీకి చెందిన నెన్నెల ఉపసర్పంచ్ పుప్పాల అంజన్నతో పాటు, కుశ్నపల్లి కో ఆప్షన్ సభ్యుడు వేణుగోపాల్ సోమవారం మాజీ మంత్రి, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, చెన్నూర్ కాంగ్రెస్ నాయకుడు వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గడ్డం బ్రదర్స్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్, నాయకులు తోట శ్రీనివాస్, మహేష్‌రెడ్డి, చీర్ల కిషన్‌రెడ్డి, మహేష్‌యాదవ్, గజేందర్‌సింగ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

చెన్నూర్: హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం స్థానికంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేశ్, రమేశ్, రవికుమార్, సతీశ్, గోపాల్, వెంకటేశ్, తిరుపతిలు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సొంతింటి పథకం అమలు చేయాలి

- ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికులకు హక్కులను సాధించిన ఘనత, చరిత్ర ఐఎన్టీయూసీకి మాత్రమే ఉందన్నారు. తమ గుర్తింపు సంఘం కాలంలో అనేక హక్కులు, సదుపాయాలు కల్పించామన్నారు. వచ్చే గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీని ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఐఎన్టీయూసీలో చేరగా, వారికి ఆయన కండువా కప్పి యూనియన్‌లోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు సీహెచ్ భీంరావు, గరిగే స్వామి, రవి, నాయకులు తిరుపతి, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట 2గనిపై ఉద్యోగులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిపై సోమవారం కళాజాత బృందం ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఓటుపై అవగాహన కల్పించారు. కార్మికులు వందశాతం ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు ముల్కల మురళి, వెల్తూరి పోశం, మామిళ్ల లచ్చన్న, రాంటెంకి రాజతిరుపతి, వడకపురం రవికుమార్, కొప్పర్తి రవీందర్, సల్లూరి కిష్టయ్య, మిట్టపల్లి సంధ్య తదితరులున్నారు.

చీడ పీడలపై అప్రమత్తంగా ఉండాలి



వరిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కిరణ్మయి

తాండూర్: వరి పొలాల్లో ప్రస్తుతం కంకులు ఏర్పడే దశలో ఉన్నాయని, ఈ సమయంలో పంటకు చీడపీడలు ఆశించకుండా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వ్యవసాయాధికారి కిరణ్మయి సూచించారు. మండలంలోని కొమ్ముగూడెంలోని వరి పొలాలను సోమవారం స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పొలాల్లో సుడి దోమ ఉధృతితో పాటు పలు రకాల చీడలు ఆశించినట్లు గుర్తించారు. రైతులు ఇష్టారీతిన పురుగుమందులు పిచికారీ చేయకుండా, వ్యవసాయ నిపుణుల సలహాలతో మందులు పిచికారీ చేసి పంటను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ధనలక్ష్మి, రైతులు ఉన్నారు.

చి'వరి' తడుల కోసం తండ్లాట

- ఇంకిపోతున్న చెరువులు
- ఎండిపోతున్న వరిపొలాలు
- పొట్ట దశలో ఉన్న వరి పంటను దక్కించుకునేందుకు భగీరథ యత్నాలు
- నీటి కోసం ఇబ్బందులు పడుతున్న రైతన్నలు



కంబాల కుంట వద్ద ఆయిల్ ఇంజన్లు



ఎండిపోయిన తిమ్మయ్య చెరువు

నెన్నెల: విత్తు నాటి పంట చేతికి అందే వరకు అన్నదాతలకు అన్నీ కష్టాలే. ఎంత కష్టం చేసినా పంట చేతికి అందుతే అన్నీ మర్చిపోయి రైతన్నలు ఆనందంగా ఉంటారు. అలాంటిది నెన్నెల మండలంలో చివరి తడి అందితే చేతికి వచ్చే వరి పంట కోసం రైతులు 'కన్నీటి' కష్టాలు పడుతున్నారు. గత్యంతరం లేక గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీటిని తోడేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పంటలకు సరిపడా నీరు అందకపోయినా, చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలకు నీటి తడులు అందక ఎండిపోతుండటంతో రైతుల కళ్లల్లో కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. గత నెలన్నర రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పాటు ఎండలు మండుతుండటంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఎలాగైనా పంటలను దక్కించుకోవాలనే తపనతో రైతులు బోర్లు, వ్యవసాయ బావులు, వాగులు, కుంటలు, చెరువుల వద్ద ఆయిల్ ఇంజన్ల సాయంతో పైపులైన్లను వేసి పొలాలకు నీరు అందిస్తున్నారు.

పొలం ఎండుతోంది



కంబాల కుంట కింద ఎకరం పొలం కౌలుకు తీసుకొని సాగు చేశాను. అప్పులు చేసి రూ.40వేల పెట్టుబడులు పెట్టాను. పొలం ఈనే దశలో ఉన్నది. వానలు లేక చెరువులో నీళ్లన్ని పారించుకున్నం. ఇప్పుడు ఇంజన్లు పెట్టి నీరు పెడదామన్న చెరువులో చుక్క నీరు లేదు. ఉన్న కొద్ది నీటిని పొలానికి ఆయిల్ ఇంజన్‌తో పెడుతున్నా. పొలం ఎండిపోతుంది. కౌలుతో పాటు పెట్టుబడి మునుగుడే.

- దుర్గం ఇస్తారి, రైతు(నెన్నెల)

వ్యాక్సినేషన్

జన్నారం: గొర్రెలు, మేకలలో వ్యాప్తించే పారుడు వ్యాధికి తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని పశు యజమానులకు మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పశువులకు వ్యాక్సినేషన్ చేశారు.